

# ఆఖరి వీడ్కోలు

పోల్కంపల్లి శాంతాదేవి

(గత సంచిక తరువాయి)

తరువాత మాధవ్ లేచి లోపలికి వెళ్ళబోతుంటే స్వరూప్ ఆపాడు. "ఈ రోజు భోజనానికి వస్తానని నవ్వులాటకి అన్నాను. మీ ఆవిడనేమీ శ్రమపెట్టకు!"

"టీ కూడా తీసుకోవా?"

"దానికేం అభ్యంతరం లేదు."

మాధవ్ వెళ్ళి రెండు కప్పులు టీ చెయ్యమని చెప్పి వచ్చాడు. మీ ఆవిణ్ణి పరిచయం చెయ్యమని స్వరూప్ అడగక పోతే బాగుండును. ఆ టీ తనే తెచ్చి యిచ్చే మాట్లాడి పంపేసేవాడు. ఇప్పటికి గండం గడిచేది. అయినా తనదెంత పిచ్చి? వీళ్ళను ఇప్పుడు కలుసుకోకుండా చేస్తే ఎప్పటికీ చేయగలడా? మనుషుల్ని దూరం చేసినా మనసుల్లో చివుళ్ళువేసే మమతను తను త్రుంచివేయగలడా? ఇదంతా తన ఖర్మకు వచ్చి పడింది!

మాధవ్ తనే టీ తీసుకువచ్చాడు.

మాధవ్ చేతినుండి కప్పు అందుకుంటూ నిష్ఠూరంగా, "ఏరా? నీ భార్యకు జనానా?" అని అడిగాడు స్వరూప్.

గత్యంతరం లేనట్టుగా లోపలికి వెళ్ళి

చెప్పాడు స్వప్నతో. "నా ఫ్రెండు నిన్ను చూస్తానంటున్నాడు. ఒకసారి అవతలకి రా, స్వప్నా!"

స్వప్న భుజాలచుట్టూ పమిట కప్పుకొని అతడి వెనకాలే నడిచింది.

"షి ఈజ్ మై వైఫ్! స్వప్నా బి.ఎ., బి.ఇడి." ఉద్వేగ రహితంగా పరిచయం చేయాలనుకొన్నాడు గాని మాధవ్ బయట పడిపోయాడు.

కప్పు టీపాయ్‌మీద పెట్టి చేతులు జోడించబోయాడు స్వరూప్. పెద్ద మెరుపుతో పిడుగు రాలినట్టుగా అయింది.

స్వరూప్‌ని చూసి ఒక్క క్షణం ఆగలేదు స్వప్న. లోపలికి పారిపోయింది.

"చూశావుగా?' ప్రతి ఆదివారం భోజనానికి రా, అన్నయ్యా' అని ఆవిడ చేత పిలిపించుకోవూ?" ఒక విధమైన కసితో, వ్యంగ్యంతో అడిగాడు మాధవ్.

"సారీ, మాధవ్! ఇప్పుడు నేనేం మాట్లాడలేను. వస్తాను." వెళ్ళిపోయాడు స్వరూప్, పిచ్చెక్కి పారిపోతున్న వాడిలా.

లోపలికి వచ్చి చూసిన మాధవ్‌కి స్వప్న పక్కమీద బోర్లాపడి ఏడుస్తూ కనిపించింది. నిశ్శబ్దంగా ఇవతలకి వచ్చేశాడు.

మరునాడు మాధవ్ ఆఫీసులో ఉండగా స్వరూప్ పంపిన ఒక మనిషి ఒక కవరు తెచ్చిచ్చాడు. "స్వరూప్‌సాబ్ ఇది మీ కిమ్మన్నారు!"

కవరు చించి లోపలున్న కాగితం తీసి చదువుకొన్నాడు మాధవ్.

"డియర్ మాధవ్!

నిన్నిలా పిలుచుకొనే అర్హత కోల్పోయానేమో! నిజంగా ఒక శత్రువు చేయవలసిన పని చేశాను నీ పట్ల. నిన్న అక్కడి నుండి వచ్చేశాక నాకు ఆత్మహత్య చేసుకు చచ్చిపోవాలనిపించింది. నా ప్రేమ కథ నీ ముందు వాగిననాడు నీ గుండెలో అగ్ని రగిలిస్తున్నానని తెలియదు. స్వప్న బ్రతుకులో నిప్పులు పోస్తున్నానని తెలియదు.

స్వప్న నీ భార్య అయిందని తెలిస్తే నావల్ల మీ ఇద్దరికీ ఇంత ద్రోహం జరిగేది కాదు, మాధవ్! తెలిసి తాకినా, తెలియక తాకినా నిప్పు కాలుస్తుంది. నేను చేసిన తప్పూ అంతే నా హృదయాన్ని దహించివేస్తూఉంది! తన భార్య మరొకరికి ప్రేయసి అని విన్నప్పుడు ఏ మగవాడైనా ఎంత నరకం అనుభవిస్తాడో నేను ఊహించగలను. నేను చేసిన తప్పూ అంతే.

నువ్వు నాకు ముఖం తప్పించి ఎందుకు తిరుగుతున్నావో స్వప్నని నీ భార్యగా చూశాక అర్థమైంది! నే నెంత చపటగా ప్రవర్తించాను!

మాధవ్!

నిన్ను నేను ప్రార్థిస్తున్నాను. స్వప్ననేమీ బాధపెట్టకు. స్వప్న నన్ను

ప్రేమిస్తుంది. నిజమే. కాని, తనలా హద్దులు తెలిసిన అడపిల్లని నే నెక్కడా చూడలేదు. తన కుటుంబంకోసం, గౌరవంకోసం తన ప్రేమను కూడా త్యాగం చేసిన ఉత్తమ స్త్రీ ఆమె. నేను చేసిన పొరపాటు సరిదిద్దుకోవడంకోసం ఇలా చెబుతున్నా ననుకోకు. స్వప్నని తెలిసిన ఎవరైనా ఈ మాట చెబుతా రనుకొంటాను!

ఇక స్వప్న నా ఊహల్లో కాపురం చేయదని నీకు హామీ ఇస్తున్నాను. స్వప్న ఒకనాడు నా ప్రేయసి అయినా ఈనాడు ఒకరి ఇల్లాలు కదా? ముఖ్యంగా నా స్నేహితుడి భార్య అయ్యాక ఆమె వింకా కలువరించే నీచస్థితికి దిగజారను! ఇప్పటికి నేను చేసిన ద్రోహం చాలు. ఇంకా మిత్రద్రోహం చేయను. మాధవ్, నన్ను విశ్వసించు!

స్వప్నా, నువ్వు అన్యోన్యంగా జీవించాలని ఆకాంక్షిస్తూ, మీ మధ్య నుండి నిష్క్రమిస్తున్న - స్వరూప్".

* * *

అన్యమనస్కంగా పనిచేసుకొంటు న్నది స్వప్న.

ఆమె మీదికి స్వరూప్ వ్రాసిన కవరు విసిరి తన గదిలోకి వచ్చాడు మాధవ్. శారీరకంగా, మానసికంగా అలసిపోయినట్టుగా బట్టలు కూడా విడవకుండా పక్కమీద పడి అలాగే నిద్రపోయాడు. అతడికి మెలుకువ వచ్చేసరికి గదిలో చీకట్లు ముసిరి ఉన్నాయి. మాధవ్ లేచి లైట్‌వేసి అవతలికి వెళ్ళాడు. ఇల్లంతా చీకటిలో మునిగి ఉంది! అన్ని గదుల్లో లైట్లు వేస్తూ వెళ్ళి స్వప్న గదిలో కూడా వేశాడు.

స్వప్న పడుకొని ఉంది!

బుగ్గలమీద చారికలు కట్టిన కన్నీరు లైట్ వెలుగులో మెరుస్తూంది. విసురుగా ముఖం తిప్పుకొని కిచెన్‌లోకి వెళ్ళాడు. ఫ్లాస్కు కదిలించి చూశాడు. తనకోసం టీ పోసి ఉంది! వంట పాత్రలమీద మూతలు తీసి చూశాడు. అన్నం తన ఒక్కడికోసమే వండినట్టు గమనించాడు.

"స్వప్నా!" అన్నాడు ,గదిలోకి తిరిగి వచ్చి.

స్వప్న కళ్ళు తెరవలేదుగాని మెలుకువతో ఉన్నట్టు కదిలింది.

"ఈ మూగ బాధ, విరహ వ్యధా ఎన్నాళ్ళు?" కటువుగా అడిగాడు.

స్వప్న నుండి జవాబు రాలేదు.

"ఈ పరిస్థితి ఎక్కువ రోజులు భరించే శక్తి నాకు లేదు దీనికి పరిష్కారం తొందరగా జరగాలి! అంతగా స్వరూప్‌ని మరిచిపోలేనిదానివి నాతో కాపురం చేస్తానని ఎందుకు మాటిచ్చావ్?"

"........" ఇప్పుడు కూడా స్వప్న నుండి జవాబు రాలేదు.

మాధవ్‌కి కోపం, ఆగ్రహం ఆగ లేదు. స్వప్న భుజాలు పట్టి కుదించి

లేపాడు. "బిగుసుకు పడుకొంటే కాదు. నాకు జవాబు చెప్పు!"

"నా కింత విషం తెచ్చిపెట్టండి! చచ్చిపోతాను!" స్వప్న దీనంగా అంది.

"ఎందుకు? నేను వెళ్ళి జైల్లో కూర్చోడానికా?"

"కాపురం చేయనన్నానా? చేస్తాను. చేస్తున్నాను."

"వండడమూ, పెట్టడమూ-దీన్నేనా కాపురమనేది?"

"మీ ఉద్దేశ్యం అర్థంచేసుకోలేని పసిపిల్లనేం కాదు. మీరు కోరితే ఈ శరీరం మీకివ్వడానికి సిద్ధమే."

"మనసులేని ఆ శరీరం నాకు శవంతో సమానం. దానితో కాపురం చేసే దిక్కుమాలిన గతి నాకు పట్టలేదు. ఆ సంగతి నీ కిదివరకే స్పష్టం చేశాను! స్వరూప్‌ని మరిచిపోతా నన్నావు!"

"దానికి నాకు కొంత టైం కావాలి."

"కొంత కాలం కాదు. జీవితమైనా సరిపోదు!"

"మీ రింత సంకుచితంగా నన్ను పీడిస్తుంటే నిజంగా అతడిని మరవడానికి జీవితకాలం సరిపోదేమో! మీ దుష్టత్వం ముందు అడుగడుగునా స్వరూప్ మంచితనం గుర్తుకువస్తూ ఉంటుంది! మీరు నిర్దయగా ప్రవర్తించినప్పుడల్లా అతడి ప్రేమ గుర్తువస్తుంది.

"నా మనసులో ఏ కల్మషం లేకుండా నా మనసు విప్పి చెప్పుకొన్నాను మీకొకనాడు. నన్నర్థం చేసుకొని సానుభూతి చూపితే ఎంత బాగుండును! స్వరూప్‌ని మరిపించేలా మీరు నన్ను ప్రేమించలేరా?"

ఒకనాడు తనలో చేసుకున్న నిర్ణయమే ఈరోజు స్వప్ననుండి వింటూంటే మండిపోయాడు. "ఈ మాట నువ్వు మన పెళ్ళికి ముందే అడగవలసింది! నేనొక ఉత్తమపురుషుడ్ని ప్రేమించాను. మా అమ్మా, నాన్నా బలవంతంచేత మిమ్మల్ని పెళ్ళిచేసుకొంటున్నాను. నా భగ్నహృదయం పట్ల సానుభూతి వ్యక్తంచేసి అతడిని మరిపించేలా ప్రేమనందిస్తారా అని! ఇప్పుడడిగితే నీ ముఖాన విడాకులు పారేయడం తప్ప ఇంకేం జరగదు నీకు!"

"ఇంత హృదయం లేని మనిషితో కాపురం చేయటంకంటే ఆ విడాకులే నయమనిపిస్తోంది!" నిర్వేదంగా అంది.

ఈ మాటతో మాధవ్ కోపం మితిమీరిపోయింది.

స్వప్న సుకుమారమైన బుగ్గలమీద బలిష్ఠమైన అతడి చెయ్యి కసితో నర్తించింది. "ఆ హృదయం ఉన్నవాళ్ళనే పెళ్ళాడితే నా కీ పీడ పట్టేది కాదుగా? ఛీ ఛీ! జీవితం నాశనం చేశావ్!" రౌద్రంగా అరిచాడు. "తెల్లారేసరికి నువ్వు ఈ యింట్లో ఉండడానికి వీల్లేదు! ఈ ఇంట్లో నీ సామానేదైనా ఉంటే తీసుకొని వెళ్ళిపో!"

మాధవ్ విసురుగా బయటికి నడిచాడు.

## 11

ఎవరో కాలింగ్ బెల్ అదే పనిగా నొక్కుతున్నారు.

స్వరూప్ నిద్ర తేలిపోయింది. లేచి టేబుల్‌మీదున్న టైంపీస్ చూశాడు. రాత్రి పదకొండు గంటలు దాటింది. ఇప్పుడు తనకోసం వచ్చింది ఎవరబ్బా అనుకొంటూ షర్ట్ తొడుక్కుని తలుపు తెరిచాడు.

తన స్నేహితులు రాంప్రసాద్, సత్యనారాయణ!

"ఏమిట్రా? అర్ధరాత్రి వచ్చి నిద్ర చెడగొట్టారు?"

"నీకు మాధవ్ ఇల్లు తెలుసా?"

"తెలుసు. ఎందుకు?"

"తాగి ఒళ్ళు తెలియకుండా రోడ్డుమీద పడివున్నాడు! వాణ్ణి టాక్సీలో వేసుకు వచ్చాం తిన్నగా యింటికి చేరుద్దామంటే వాడి ఇంటి అడ్రస్ తెలియదు."

"మాధవ్ తాగాడా? వాడికి తాగుడు అలవాటు ఉందా?" పిడుగుపడ్డట్టుగా అడిగాడు స్వరూప్.

"వాణ్ణి స్థితిలో చూసింది ఈరోజే. ఎప్పుడైనా పార్టీల్లో పుచ్చుకొనే వాడను కొంటాను!" సత్యనారాయణ అన్నాడు.

స్వరూప్ కిందికి వచ్చి టాక్సీలోకి తొంగి చూశాడు. వెనుక సీట్లో అస్త వ్యస్తంగా పడుకొని ఉన్నాడు మాధవ్.

"రే, మాధవ్! మాధవ్!"

"......"

స్వరూప్ అతడిని గిల్లాడు. అతడిలో ఎలాంటి కదలికా రాలేదు. ఎక్కువ డోసే పడిందని గుర్తించాడు.

"వీణ్ణి స్థితిలో యింటికి తీసుకువెడితే వీడి భార్య బాధపడుతుందేమో!"

"కొత్తగా పెళ్ళయినవాడు. భార్యను వాటేసుకొని ఇంట్లో పడుకోవలసిన వాడు బార్‌లో దూరి తప్పతాగి రోడ్డు మీద పడి ఉన్నాడంటే ఆ భార్య ఎలాంటిదో, ఆ కాపురం ఎలా సాగుతుందో మనం ఊహించుకోవచ్చు!" రాంప్రసాద్ ఎగతాళిగా అన్నాడు.

"ఆమె పెళ్ళికి ముందే ఎవరినో ప్రేమించిందట. వీడితో మనసు లేని కాపురం చేస్తోందట. వాడీ రోజు చాలా వాగాడు. త్వరలో ఆవిడకు విడాకు లిచ్చేస్తున్నానని చెప్పాడు."

స్వరూప్ తలగిర్రున తిరిగిపోయింది. మాధవ్‌ని ఈ రోజు తన దగ్గరే ఉంచుకొని పొద్దున వాడికి బాగా బుద్ధిగరిపి పంపాలన్న ఆలోచన విరమించుకొని మాధవ్‌ని అతడింటికి తీసుకు వెళ్ళడానికే నిశ్చయించుకొన్నాడు. పైకివచ్చి జేబులో కొంత చిల్లర వేసుకొని ఇంటికి తాళం పెట్టి లుంగీతోనే బయల్దేరాడు.

రాంప్రసాద్, సత్యనారాయణ అక్కడినుండే సెలవు తీసుకొని వెళ్ళి పోయారు.

టాక్సీ ఇల్లు సమీపిస్తూంటే స్వరూప్ హృదయంలో అలజడి కెరటం ఉవ్వెత్తుగా లేచింది. ఈ స్థితిలో మాధవ్‌ని తీసుకొని స్వప్న ఎదుట ఎలా పడాలి? ఏమని చెప్పాలి?

టాక్సీ దిగి తలుపు మీద టక టక కొట్టాడు స్వరూప్.

స్వప్న తలుపు తీసింది. "మీరా!" భయంతో రెండడుగులు వెనక్కి వేసింది.

స్వరూప్ టాక్సీవాడి సాయంతో మాధవ్‌ని ఇంట్లో పక్కమీదికి చేర్చాడు.

"ఏమిటి! ఏమైంది ఆయనకి?" కంగారుపడిపోయింది స్వప్న.

"ఏం లేదు. కాస్త మందు పుచ్చుకొన్నాడు!" టాక్సీ వాడికి డబ్బులిచ్చి పంపేశాడు

స్వప్న ముఖం వివర్ణమైంది. "మీరీయన్ని ఎక్కడ పట్టుకొచ్చారు?"

చెప్పాడు స్వరూప్.

స్వరూప్ కూడా పార్టనర్ కానందుకు సగం భారం తీసేసినట్టయింది స్వప్నకి.

స్వరూప్ ముందు గదిలోకి వచ్చి కూర్చున్నాడు. "స్వప్నా! వీడు ఈ రోజేనా...." అ డ గ లే క అడుగుతున్నట్టుగా అడిగాడు.

"ఈయన తాగుతారని నాకు తెలియదు! ఈ రోజే చూస్తున్నాను."

"ఈ రోజు వీణ్ణి బార్‌కి తరిమే సంఘటన ఏం జరిగింది"

"............"

స్వప్న నుండి జవాబు రాకపోయేసరికి స్వరూప్ కళ్ళెత్తి సూటిగా ఆమెకేసి చూశాడు. ఎర్రగా కంది ఉబ్బినబుగ్గ అతడిని దిగ్గున కుర్చీలోంచి లేచి ఆమెని సమీపించేలా చేసింది.

"స్వప్నా! ఏమిటిది? వాడు నిన్ను కొట్టాడా?" ఆవేశం, ఆరాటం మేళవిస్తూ అడిగాడు.

"........"

"మాట్లాడు, స్వప్నా! ఈ సుఖం కోసమేనా నన్ను త్యాగం చేసింది? వీడు తప్ప తాగి తన భార్య ఇంకెవణ్నో ప్రే మి ం చి ం ద ని వాగుతోంటే మీ కుటుంబం పరువు ప్రతిష్ఠలు నిలిచాయనే అనుకొంటున్నావా?"

స్వప్న దోసిట్లో ముఖం దాచుకొని ఏడవసాగింది.

స్వరూప్ బరువుగా ఒక నిట్టూర్పు విడిచి అన్నాడు. "నిజానికి నిన్ను కష్టాల పాలు చేసింది నేను. మాధవ్‌కి నువ్వు భార్యవయ్యావని తెలియక మన ప్రేమ కథ వాడితో వాగాను...."

"ఆ సంగతులు పోనివ్వండి! నా ఖర్మ ఇలా ఉంది!" స్వప్న వారించింది. జరిగిన సంఘటనలు అతడి నోటినుండి వినడం ఇష్టంలేనట్టుగా.

"ఇంత అభిమానం ఎక్కడ నేర్చుకున్నావు? దురదృష్టవశాత్తూ ఈరోజు నేను నీకు పరాయివాడిని అయ్యాను. అయితే మాత్రం? ఒక స్నేహితుడిగా నీ కష్టసుఖాలు నాతో చెప్పకోకూడదా?"

"చెప్పుకున్నందువల్ల లాభమేమీ లేదు."

"చేయలేనని ఎందు కంటున్నావు? ఇదివరకటిలా నిన్ను కోరే అర్హత నాకు లేకపోవచ్చుగాని ప్రేమించే అర్హత మాత్రం ఎప్పటికీ ఉంటుంది. ఆ ప్రేమ ఉన్న చోట ఏమైనా చేయగల శక్తి ఉంటుంది?"

"అయితే ఒకపని మాత్రం చేయండి" స్వప్న తలెత్తకుండానే అంది. "మీ రెప్పుడూ మా కళ్ళబడనని మాటివ్వండి!"

"స్వప్నా!" స్వరూప్ షాక్ తిన్నాడు. స్వప్న ఇంత నిర్దయగా మాట్లాడుతుందని అతడనుకోలేదు.

"మీరు మళ్ళీ మళ్ళీ నా కళ్ళబడు తుంటే మిమ్మల్ని మరిచిపోయే శక్తిని కోల్పోతాను! మీరు కనిపించినప్పుడల్లా మాధవ్ మన ప్రేమకథ గుర్తు తెచ్చు కొంటాడు. ఈర్షతో రగిలిపోతాడు. ఇలా జరుగుతోంటే మా సంసారం ఏనాటికీ ముడిపడదు."

"అలాగే, స్వప్నా!" బరువుగా అన్నాడు. అతడి కళ్ళు అప్రయత్నంగా చెమ్మగిల్లాయి. "నేను ఈ ఊరెనుండే కాదు, ఈ ప్రపంచం నుండే వెళ్ళి పోతాను నీ కోసం!"

"స్వ....రూ....ప్!" మళ్ళీ ఏడవ సాగింది స్వప్న. నువ్వు ఉన్నతుడివి; ఇంకా ఇంకా ఎదిగిపోవద్దు! నువ్వు ఎదిగిపోతున్న కొద్దీ నా భర్త ఇంకా కురచనై పోతాడు. నే నాయన్ని ప్రేమించలేను! నీ మంచితనం గుర్తు చేసుకోవడంలోనే నా జీవితం తెల్లవారి పోతుంది!"

స్వరూప్ లేచాడు. "ఆరోజు .... దేవీబాగ్‌లో సెలవు తీసుకోవడమే నీ జీవితంనుండి శాశ్వతమైన నిష్క్రమణ అనుకొన్నాను! మళ్ళీ ఇలా నీ జీవితంలో అడుగుపెట్టి దుమారం రేపుతాననుకో లేదు! నేను వెళ్ళిపోతాను స్వప్నా! నీ జీవితం నుండి నా అడుగుల గుర్తులు తుడిచివేసుకో. నీ భర్తని ప్రేమించు! నీ సంసార నావ ఏ ఒడిదుడుకులూ లేకుండా సాగిపోవాలని కోరుకొంటు న్నాను!"

స్వరూప్ వెళ్ళిపోయాడు.

## 12

ఉదయం ఎనిమిది గంటలకు మెలు కువ వచ్చింది మాధవ్‌కు. తల వేయి సుత్తెలతో బాదుతున్నంత నొప్పిగా ఉంది! శరీరం రౌడీల చేతుల్లో చావు దెబ్బలు తిన్నట్టుగా ఉంది. బెడ్‌మీది నుంచి లేవాలనిపించలేదు. అలా పడుకొనే నిన్నటి సంఘటనలను కలను గుర్తుచేసుకొన్నట్టుగా గుర్తుచేసుకో సాగాడు. తను స్వప్నని కొట్టాడు. చదువు, సంస్కారం ఉన్న తను భార్యని కొట్టాడు. పెళ్ళికి ముందు ఆమె ఒకడిని ప్రేమించిందని, ఇంకా అతడిని మరిచి పోలేక విరహవ్యథ పడుతున్నదని

ఈర్ష్యలో రగిలిపోతూ కొట్టాడు! తను బ్రహ్మచారి కాదని తనే చెప్పుకొన్నాడామెతో. కాని, ఆ విషయమే ఆమె తనని మళ్ళీ ప్రశ్నించలేదు. ఆమెకు లేని ఈర్ష్య తన నొక్కడినే ఎందుకు బాధిస్తున్నట్టు?

మాధవ్ తర్కించుకొంటూ వేళ్ళతో నుదురు రాచుకోసాగాడు.

స్వప్నని కొట్టి తను ఆ కోపంతో, తాపంతో బార్ కి వెళ్ళాడు. ఎంత సిగ్గుమాలినవాడై పోయాడు! సీసాలు ఖాళీ అవుతుంటే తనలోని బాధను ఎవరో తుడిచివేసినట్టుగా అయింది. గాలిలో తేలిపోతున్నట్టుగా అనిపించింది. పిచ్చి హుషారు వచ్చేసింది. తరువాత తను కూనిరాగాలు తీసినట్టు గుర్తు. తరువాత ఇంకేమీ గుర్తురాలేదు. తను ఇంటికి ఎలా వచ్చాడు? ఎప్పుడు వచ్చాడు?

స్వప్నని అడగాలంటే సిగ్గేసింది. అసలు ఆమె ముఖమెదుట పడాలంటేనే అతడికి ముఖం చెల్లడంలేదు

కాని, స్వప్నే వచ్చింది అతడిని లేపడానికి

"ఆఫీసుకు టైం అవుతూంది లేవండి."

మాధవ్ ఆమె ముఖంకేసి చూశాడు. కందిన బుగ్గ తన పశుత్వాన్ని ఎత్తి చూపినట్లుగా అయింది.

అభిమానాన్ని చంపుకొని అన్నాడు: "నిన్నటి నా ప్రవర్తనకు క్షమించు స్వప్నా!"

బ్రష్‌మీద పేస్ట్ వేసి ఇచ్చింది.

మాధవ్ ముఖం కడుక్కువచ్చాడు.

స్వప్న టీ ఇచ్చింది.

ఒక్కో గుక్క తాగుతూ రాత్రి తను ఇంటికి ఎలావచ్చాడో గుర్తుచేసుకోడానికి ప్రయత్నించాడు. కాని, గుర్తు రావడంలేదు.

చివరికి స్వప్నని అడిగాడు.

"మీ స్నేహితుడు టాక్సీలో తీసుకు వచ్చాడు. మీకుఒంటిమీద స్పృహలేదు."

రాంప్రసాద్ గుర్తు వచ్చాడు మాధవ్‌కు. బార్‌లో ఇద్దరూ కలిసే తాగారు! వాడే తీసుకువచ్చి దిగవిడిచాడేమోనని ఇంకేం ప్రశ్నించలేదు మాధవ్. త్వరత్వరగా తయారై ఆఫీసుకు వెళ్ళిపోయాడు. ఆఫీసులో రాంప్రసాద్ వల్ల అసలు సంగతి తెలిసి స్వప్నమీద ఉదయం కలిగిన కరుణభావం తుడిచిపెట్టుకుపోగా ఉగ్రుడై పోయాడు. రాత్రి ఇంటికి స్వరూప్ వస్తే 'నీ స్నేహితుడు' అని ఎందుకు చెప్పింది స్వప్న? స్వరూప్ వచ్చాడని ఎందుకు చెప్పలేదు? ఈ దాపరికం ఎందుకొచ్చింది? ఇంటికి అర్ధరాత్రి వచ్చినవాడు ఊరికే వెళ్ళి ఉంటాడా? స్వప్నతో ఏం మాట్లాడకుండానే వెళ్ళిఉంటాడా?....అనుమానంతో కూడిన ఆలోచనలు అల్లిబిల్లిగా పారాడసాగాయి మనసులో.

సాయంత్రం పని అయిపోయాక ఆఫీసు బయటికి వచ్చాడు మాధవ్.

స్కూటర్ ఆపుకొని అతడికోసమే వేచిఉన్నాడు స్వరూప్.

స్వరూప్‌ని చూస్తూనే యధాప్రకారం చిటపటలాడింది మాధవ్ ముఖం.

అతడి ముఖ లో అతడి మనోభావాలు చదవగలిగిన స్వరూప్ ముఖం పాలిపోయింది. "నీకు కష్టమైనా ఈ ఒక్క రోజుకు నన్ను భరించాలి. నా మాటలు వినాలి! ఎక్కు!"

"ఉహూం. ఇంటికి వెళ్ళాలి!"

"ఇంటిమీద, ఇల్లాలిమీద నీ కెంత ప్రేమో నాకు బాగా తెలుసుగాని పద!" రెక్కపట్టుకు లాక్కుపోయి స్కూటర్ మీద కూలేశాడు.

నేరుగా హోటల్‌కి తీసికెళ్ళి మాధవ్‌ని కూర్చోబెట్టాడు. స్వరూప్ టిఫిన్‌కి ఆర్డరివ్వబోతే వారించాడు మాధవ్. "ఏమీ వద్దు ఇప్పుడు! ఏం మాట్లాడతావో మాట్లాడు."

ఈసారి టీకి మాత్రమే ఆర్డరిచ్చి తెప్పించాడు స్వరూప్. రాత్రి ఏం జరిగిందో నీకు ఉదయం తెలిసిందను కొంటాను!" అంటూ మొదలుపెట్టాడు.

"నువ్వేదో ఆడదానివల్ల మోసపోయినవాడిలా నిన్ను నీవే దీనావస్థకు దిగజార్చుకొని బారుల్లో దూరి తాగుబోతుగా ఎందుకు మారాలనుకొంటున్నావు? తప్ప తాగి రోడ్డుమీదపడితే నీ బాధ తీరిపోతుందనుకున్నావా?"

"జీవితంలో నేను మోసపోలేవా?" ఉక్రోషంగా అడిగాడు.

"సహృదయతకి చోటివ్వగలిగితే అది మోసమనుకోవు. చెదిరిన ఒక జీవితాన్ని సరిదిద్దినవాడివవుతావు! సానుభూతికి బదులు ప్రతీకారానికి పూనావే. ఇది నన్నెంత బాధపెడుతున్నదో తెలుసా?"

"నేనున్న చోట నువ్వుంటే నా బాధేమిటో నీకు తెలిసేది!"

"నీచోట నేను లేకున్నా ఊహించలేనా? నీలాంటి బాధ కాకపోయినా దాన్నిమించిన బాధనే అనుభవించానురా నేను! స్వప్న నాది కాదనుకొన్నరోజు ఆత్మహత్య చేసుకు చచ్చిపోవాలనిపించింది. కాని, చచ్చిపోవాలనిపించినంత మాత్రాన చచ్చిపోలేం. అంతర్లీనంగా ఉన్న జీవితేచ్ఛ మనని అడ్డగిస్తుంది! సరే. ఆ బాధ మరిచిపోదామని నేనూ నీలాగా బార్‌వరకూ వెళ్ళినవాడినే. కాని, అది పాతాళబిలంలోకి అడుగువేయడమని నాకు తెలుసు! తాగకుండా వెనక్కి వచ్చేశాను!"

"అందరికీ నీకున్న ఆత్మస్థైర్యం, సంస్కారం ఉండవు!" ఎత్తిపొడుగా అన్నాడు.

"అవి ఎవరికీ ఉండవు. మనల్ని మనం పరీక్షకు పెట్టుకోవడంవల్ల ఏర్పడతా యవి! జీవితాన్ని పాఠశాలను చేసుకోగలిగితే మనం నేర్చుకొనే అద్భుతమైన పాఠాలెన్నో నీ బాధకి కారణం నేను ఒకనాడు చెప్పిన కథే

కారణమైతే, ఆ ప్రేమకి స్వప్నగుండెల మీద మాంగల్యాలు కనిపించిన రోజే చితిపేర్చడం జరిగింది. ఇక స్వప్న సంగతి కూడా నేను చెప్పగలను. అగ్ని సాక్షిగా ఒకరికి ఇల్లాలై మరొకరిని ఆరాధిస్తూ కూర్చొనే అజ్ఞాని కాదామె. అందుకే నేను చెబుతున్నాను స్వప్ననీ నన్నూ కలిపి ఆలోచించడం మానెయ్యి! అనవసరమైన అనుమానాలతో నీ జీవితం నరకం చేసుకోవద్దు! స్వప్నని నిండు మనసుతో స్వీకరించు. ప్రేమించు!"

"హితబోధ అయిందనుకొంటాను!" మాధవ్ విసుగ్గా లేచాడు.

తన మాటలన్నీ బూడిదలో పోసిన పన్నీరు అయిందని గ్రహించడానికి ఎంతోసేపు పట్టలేదు స్వరూప్‌కి. సుదీర్ఘమైన నిట్టూర్పు విడిచాడు

* * *

ఇంటికి వెడుతూనే స్వప్నతో గొడవ పెట్టుకున్నాడు మాధవ్. "రాత్రి వచ్చింది ఎవరు ?"

"స్వరూప్."

"నీ స్నేహితుడని ఎందుకు చెప్పావ్ ?"

"ఇప్పుడు చెబుతున్నాను కదా ? స్వరూపే వచ్చాడు. ఏమిటంటారు ?" సహనం చచ్చినట్టు అడిగింది స్వప్న.

"ఏం మాట్లాడాడు ?"

"మీరు తప్పతాగి ఒళ్ళు తెలియకుండా మీ భార్య ప్రేమగాథ దప్పువాయించిన సంగతి మీ కొలీగ్ చెప్పాడట. ఆ సంగతే చెప్పాడు. మీ భార్య పెళ్ళికి ముందే ప్రేమాయాణం నడిపిందని అందరికీ చెప్పుకోవాలనే ఉంటే దాని కోసం బార్‌కి వెళ్ళి తప్పతాగనే అవసరం లేదండీ! 'నా భార్య పెళ్ళికి ముందే ఒకణ్ణి ప్రేమించింది' అని బోర్డు వ్రాయించి ముఖానికో, వీపుకో కట్టుకొంటే చాలు సమాజంనుండి మీకు బోలెడంత సానుభూతీ, సన్మానం లభిస్తాయి!" తీక్షణంగా అంది స్వప్న.

మాధవ్ ఆలోచనలో పడ్డాడు నిజంగా తను స్వప్న గురించి అలా వాగాడా ?

స్వప్నని దబాయించబోయి ఇప్పుడు స్వప్న దబాయింపుకు లొంగాల్సి వచ్చింది మాధవ్. కాని, రాత్రి స్వరూప్ యింటికి వచ్చి వెళ్ళాడంటే మనసులో ముల్లు సెలవేసినట్టుగా ఉంది. ఇద్దరి మధ్య ఎలాంటి సంభాషణ నడిచి ఉంటుంది ? వేడి వేడి నిట్టూర్పులు ఎన్ని వదులుకున్నారో ?

ఈ సంఘటన తరువాత మాధవ్‌కి బయటి వాతావరణం కొంచెం సంకట ప్రాయంగా తయారైంది. రాంప్రసాద్ ఏం చెప్పాడో ఆఫీసులో కొలీగ్స్ గుసగుసలు పోతున్నారు. పరిహాసపు మాటలు విసురుతున్నారు మొత్తానికి తను చాలా చులకనై పోయినట్టు ఫీల్ కాసాగాడు మాధవ్.

దీనికంతా కారణం ఆ రాత్రి తను తాగి వాగడమే కదా? తానై తాను బయటపెట్టుకొన్నాడు పెళ్ళికి ముందు తన భార్య నడిపిన ప్రేమాయాణం। పరిహాసపాత్రమైపోయాడు ఈ ప్రపంచం దృష్టిలో।

స్వరూప్ చెప్పినట్లు తను కొంచెం సహృదయత చూపగలిగితే స్వప్న తన గతాన్ని మరిచిపోగలుగుతుందేమో? అందరు భార్యా భర్తల్లా కలిసి జీవించ వచ్చునేమో। అవును. తను కాస్త సహనం చూపాలి। తను కాస్త సహనం చూపగలిగితే స్వప్న తన కనుకూల మైన భార్య కాగలదన్న నమ్మకం తన కుంది. స్వప్నని కాదని మరొకతెను పెళ్ళాడినా అది మాత్రం పతివ్రత అని గ్యారంటీ ఏమిటి? స్వప్న ఒకనాడు అన్నట్టు ఏదో ఒక క్షణంలో మనసు చలించని ఆడదీ, మనసు పారేసుకోని మగాడూ ఉంటాడా? వయసు సహజ మైన ఆకర్షణనుండి తప్పుకోడానికి తను నేర్చుకున్న విజ్ఞానం చదువుకొన్న చదువూ ఎందుకూ పనికిరావప్పుడు। ఆ ఆకర్షణ సుడిగుండంలో పడ్డామంటే గిరగిరా తిరగాల్సిందే। స్వప్నదేం తప్పు?

కాని, ఎంత సహృదయత కొని తెచ్చుకొన్నా ఆమె తొలివలపు తనది కాదన్న సత్యం అతడిని తక్కువ బాధించడంలేదు.

అయినా తన ప్రవర్తనలో మార్పు తెచ్చుకోడానికి సాధ్యమైనంతగా ప్రయ త్నించసాగాడు మాధవ్. ఆమెను గాయ పరిచే, రెచ్చగొట్టే మాటలేవీ అనడం లేదు.

కలిసి షాపింగ్‌కు వెడుతున్నారు. కలిసి సినిమాలకు వెడుతున్నారు. తమ మధ్య ఒక స్నేహబంధాన్ని ప్రతిష్టించు కొనే ప్రయత్నంలో ఇద్దరూ ఉన్నారు

ఆ రాత్రి పిక్చరు చూసి వచ్చి భోజనం చేశారు.

స్వప్న తనగదిలోకి వెళ్ళబోతుంటే మాధవ్ ఆమె రెక్క పట్టుకొని ఆపాడు. "ఈరాత్రి నుండి నీపక్క అవతలి గదిలో కాదు।"

తలదించుకొన్న స్వప్న నుండి ఎలాంటి ప్రతిఘటనా వ్యక్తం కాలేదు. మాధవ్‌ని తన గుప్పిటలో పెట్టుకోడానికి అతడి నోరు మూతపడడానికి తన శరీరాన్ని ఎరవేయడానికి సంసిద్ధంగానే ఉందామె.

స్వప్నని నెమ్మదిగా మంచం దగ్గరికి నడిపించుకుపోయాడు. ఆమెని తన బాహుబంధంలో చుట్టి ఆమె పెదవులకు తన పెదవులు చేర్చుతూ, "స్వప్నా। నీ కిది మొదటి అనుభవమేనా?" అని అడిగాడు. మాధవ్‌కి ఎప్పటికప్పుడు చెప్పుకొనే బుద్ధి అంతా ఎక్కడికి పోయిందో?

(సశేషం)